# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 29 మార్చి 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 249

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





## కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల్లో అశాంతి

అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని : ఎమ్మెల్సీ కవిత



నిమిషాల వ్యవధిలో వెంట వెంటనే వచ్చిన రెండు భారీ భూకంపాలు థాయ్‌లాండ్, మయన్మార్ దేశాల్లో పెను విధ్వంసం సృష్టించాయి.

3లో

## థాయ్‌లాండ్, మయన్మార్‌లలో
# భూ విలయం

- రెండు దేశాల్లో 150 మందికి పైగా మృతి
- 750 మందికి పైగా గాయాలు
- 12 నిమిషాల వ్యవధిలో రెండు భారీ భూకంపాలు
- బ్యాంకాక్‌లో కుప్పకూలిన 33 అంతస్తుల భవనం.. శిథిలాల కింద 100 మందికి పైగా!
- మయన్మార్‌లో వెయ్యి పడకల కొత్త ఆసుపత్రి నేలమట్టం

థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో భూకంప తీవ్రత 7.7గా నమోదైంది. ప్రకంపనల ధాటికి నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలి పోయింది. విపత్తు సమయంలో 320 మంది అక్కడ పనిచేస్తున్నట్లు సమాచారం. మరో భారీ భవంతి పైఅంతస్తులో ఉన్న ఈత కొలనులోని నీరు కిందకు పడిపోయిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్ అయ్యాయి.




## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మరో మృతదేహం గుర్తింపు

## భారాస ప్రభుత్వ కృషితోనే
# తెలంగాణకు బీవైడీ

భారాస ప్రభుత్వ హయాంలోనే తెలంగాణలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ఎలక్ట్రిక్ వాహన దిగ్గజ సంస్థ 'బీవైడీ' అంగీకరించిందని, ఇప్పుడా సంస్థ తమ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం హర్షణీయమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



హైదరాబాద్: భారాస ప్రభుత్వ హయాంలోనే తెలంగాణలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ఎలక్ట్రిక్ వాహన దిగ్గజ సంస్థ 'బీవైడీ' అంగీకరించిందని, ఇప్పుడా సంస్థ తమ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం హర్షణీయమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "సుమారు 10 బిలియన్ డాలర్లు రాష్ట్రంలో పెట్టుబడి పెట్టాలని బీవైడీ సంస్థతో 2022-23లో పలుమార్లు చర్చలు జరిపాం. ఆ సంస్థ హైదరాబాద్‌లో ఒలెక్ట్రా సంస్థతో కలిసి పెట్టుబడులకు ఆసక్తి చూపినా.. చైనా పెట్టుబడులపై కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధాన పరిమితుల వల్ల ఆ నిర్ణయం వాయిదా పడింది. ఇటీవల భారత ప్రభుత్వం సరళీకృత విధానాన్ని అనుసరించడంతో ఆ పెట్టుబడి తిరిగి తెలంగాణకు వస్తోంది. మా ప్రభుత్వ హయాంలో రూపొందించిన విద్యుత్ వాహన విధాన ఫలితమే ఇది" అని కేటీఆర్ పేర్కొన్నారు. కేటీఆర్‌కు 'బ్రిడ్జ్ ఇండియా' ఆహ్వానం

బ్రిటన్‌లో జరిగే 'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సుకు రావాలంటూ 'బ్రిడ్జ్ ఇండియా'

సంస్థ కేటీఆర్‌ను ఆహ్వానించింది. ఈఏడాది మే 30న లండన్‌లో జరిగే సదస్సుకు కేటీఆర్‌ను ముఖ్య వక్తగా పిలుస్తూ, 'బ్రిడ్జ్ ఇండియా' వ్యవస్థాపకుడు ప్రతీక్‌దత్తానీ ఆహ్వాన లేఖ పంపారు.



## సంగారెడ్డి జిల్లాలో విషాద ఘటనలు

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో విషాదం చోటుచేసుకుంది. ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారులు అనుమానాస్పద రీతిలో మృతిచెందారు. అలాగే ఇద్దరు వలసకార్మికులు అనుమానాస్పద స్థితిలో బావిలో పడి చనిపోయారు. ఈ సంఘటన కోహీర్ మండలం పైడిగుమ్మల్‌లో విషాదం చోటు చేసుకుంది. ఇకపోతే పిల్లల మృతి ఘటనలో వారి తల్లి రజిత తీవ్రమైన కడుపునొప్పితో స్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. అనుమానాస్పదంగా ముగ్గురు చిన్నారులు మృతి చెందడంతో స్థానికులు కంటతడిపెట్టారు.

స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో చెన్నయ్య, ఆయన భార్య రజిత తమ ముగ్గురు పిల్లలు సాయికృష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8)తో కలిసి నివాసముంటున్నారు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో భార్యాభర్తలతో పాటు ముగ్గురు పిల్లలు ఇంట్లోనే భోజనం చేశారు. చెన్నయ్య అన్నం, పప్పు తిన్నాడు. భార్య, ముగ్గురు పిల్లలు పెరుగన్నం తిన్నారు. భోజనం తర్వాత చెన్నయ్య ట్యాంకర్ నడిపేందుకు చందానగర్ వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చాడు. రజిత తలుపులు తెరవగా.. పిల్లలు నిద్రపోతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రజితకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో స్థానికుల సహాయంతో చెన్నయ్య ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. ఆ తర్వాత పిల్లలను పరిశీలించగా.. అప్పటికే ముగ్గురూ మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెన్నయ్యది రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెడకపల్లి. ఉపాధి కోసం గత కొంతకాలంగా ఆయన అమీన్‌పూర్‌లో ఉంటున్నాడు. చిన్నారుల మృతిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పొట్టకూటి కోసం వచ్చిన ఇద్దరు వలస కార్మికులు బావిలో పడిపోయి చనిపోయారు.

## అమ్మకానికి బీడీ కంపెనీ
# ఆస్తులు.




- యూనియన్ లీడర్లే మధ్యవర్తులని అనుమానాలు.
- ఆందోళనలో వేలాది మంది కార్మికులు.
- జిల్లా కేంద్రంలోనీ ప్రధాన చౌరస్తాలో కోట్ల విలువైన ఆస్తులు.
- చేజిక్కించుకోవడానికి ఓ మాజీ కార్పొరేటర్ యత్నం.
- పుణేకు వెళ్లి యాజమాన్యాన్ని సైతం కలిసి బేరం ఆడిన నేత.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 28:**

జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో గల తమ ముఖ్య కార్యాలయాన్ని బీడీ కంపెనీ యాజమాన్యం అమ్మకానికి పెట్టింది. గత ఆరు నెలలుగా విలువైన ఆస్తులు అమ్మడానికి తీవ్రంగా ప్రయత్నిస్తుంది. అందుకు కొంత మంది కార్మిక సంఘాల నాయకులు కూడా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నట్టు సమాచారం. నిజామాబాద్ జిల్లా కేంద్రంగా ఉన్న హెడ్ ఆఫీసును ఇప్పటికే సిద్దిపేట ప్రాంతానికి తరలించింది.

కంపెనీకి నిజామాబాద్, డిచ్ పల్లి, సిద్దిపేట, సిరిసిల్ల, కామారెడ్డి పరిధిలో సుమారు 8 వేల మంది బీడీ కార్మికులు పని చేస్తున్నారు. దీనిలో మెజార్టీ కార్మికులు నిజామాబాద్ జిల్లా పరిధిలో ఉండగా ప్రధాన కార్యాలయంను మరో జిల్లాకు తరలించడం పట్ల కార్మికుల్లో గందరగోళం నెలకొంది. మరో వైపు జిల్లా కేంద్రంలోని కార్యాలయం ను అమ్మకానికి పెట్టడంతో ఆ కంపెనీలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు.

### కార్మిక నేతల మౌనం ఎందుకు ?

బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పడ్డ కార్మిక సంఘాలు క్రమంగా తమ లక్ష్యంను మరచి పోతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. ఇందుకు బీడీ కంపెనీ తమ ఆస్తులు అమ్ముకోవాలనే ప్రయత్నం ను అడ్డుకోవాల్సింది పోయి, యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించడమే నిదర్శనం. చిన్న విషయానికి ధర్నాలు, ఆందోళనలు నిర్వహించే కార్మిక సంఘాలు ఈ విషయంలో ఏమి పట్టనట్టు ఉండటం పలు అనుమానాలకు తావిస్తుంది.

### పూణెకు వెళ్ళొచ్చిన మాజీ కార్పొరేటర్.

నగరంలో ప్రధాన చౌరస్తాలో ఉన్న కోట్ల విలువైన కంపెనీ ఆస్తిని కొనడానికి మాజీ కార్పొరేటర్ పుణెలో గల యాజమాన్యం వద్దకు వెళ్లొచ్చినట్టు సమాచారం. కమర్షియల్ ఆస్తిని ఎట్లైన చేజిక్కించుకోవడానికి సదరు నేత తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తుంది. సుమారు 60 కోట్ల ధర వస్తె తక్షణం అమ్మకానికి యాజమాన్యం సిద్ధం అయినట్టు సమాచారం.

## హన్మకొండలో టాటూగ్యాంగ్ హల్‌చల్


భారీ దోపిడీకి పక్కా స్కెచ్.. ఓ ఇంట్లో భారీ దోపిడీ

సీసీ కెమెరాల ఆధారంగా పోలీసుల దర్యాప్తు

అంతర్రాష్ట్ర ముఠా పనేనని అనుమానాలు




## పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వలేం




## విష్ణుప్రియకు కోర్టులో చుక్కెదురు

దర్యాప్తునకు సహకరించండి.. నటి విష్ణుప్రియకు హైకోర్టు ఆదేశం



## విష్ణుప్రియకు కోర్టులో చుక్కెదురు

**హైదరాబాద్:** బెట్టింగ్ యాప్‌ల కేసులో నటి విష్ణుప్రియకు తెలంగాణ హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. మియాపూర్ పోలీసులు తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కొట్టేయాలంటూ ఆమె హైకోర్టులో ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం తెలంగాణ హైకోర్టు విచారించింది. ఎఫ్ఐఆర్ కొట్టేసేందుకు.. అలాగే ఈ దర్యాప్తుపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. అంతేకాకుండా..ఈ కేసులో పోలీసులకు సహకరించాలని విష్ణు ప్రియను హైకోర్టు ఆదేశించింది. అలాగే చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని పోలీసులకు హైకోర్టు స్పష్టం చేసింది. బెట్టింగ్ యాప్‌లపై ప్రచారం చేసిన పలువురు నటులు, ఇన్‌ఫ్లూయన్సర్లపై మియాపూర్‌తోపాటు పంజాగుట్ట పోలీసులు పలు కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా పలువురు హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. బెయిల్ పొందేందుకు పిటిషన్లు దాఖలు చేస్తున్నారు.

## పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హొదా ఇవ్వలేం

హైదరాబాద్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు పంపింది. కృష్ణా నదీ జలాల వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య ప్రస్తుత వివాదం సుప్రీంకోర్టులో ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్2 ఇందుకు సంబంధించిన విచారణ చేపడుతోందని కేంద్ర జలశక్తి శాఖ అధికారులు ప్రస్తావించారు. కోర్టు వివాదం నేపథ్యంలో ఈ ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ రిపోర్ట్‌ను పరిగణనలోకి తీసుకోవడం సాధ్యం కాదని కేంద్రజల్‌శక్తి శాఖ తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ప్రతిపాదనలు తెలంగాణ రాష్ట్రానికి తిరిగి పంపినట్లు లోక్‌సభలో కేంద్రం తెలిపింది. 2022 సెప్టెంబర్‌లో ప్రాజెక్టుకు జాతీయ హొదా కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి ప్రతిపాదనలు పంపిందని కేంద్ర ప్రభుత్వం గుర్తుచేసింది. 2024 డిసెంబర్‌లో ఈ ప్రతిపాదనలు తిప్పి పంపామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు విషయంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్న అడిగారు. ఈ ప్రశ్నకు జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మరో మృతదేహం గుర్తింపు

నాగర్ కర్నూల్ :ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు టన్నెల్ బోరింగ్ మిషన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు సొరంగంలో కూలిన మట్టిలో చిక్కుకుపోయి నేటికీ ఐదు వారాలు గడిచిపోయింది. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి, ఆర్మీ, కేరళ పోలీస్, క్యాడవార్ డాగ్స్ వంటి రెస్క్యూ టీంలు దాదాపు 600 మంది.. మూడు స్విఫ్ట్‌ల్లో నిరంతరాయంగా సహాయక చర్యలు చేపడుతున్నా ఫలితం లేకుండా పోతుంది. సొరంగంలో కార్మికులపై కూలిన మట్టిని తొలగించేందుకు రెస్క్యూ టీంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉబికి వస్తున్న ఊట నీటితో సొరంగమంతా బురదమయంగా మారడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తుంది. కార్మికుల మృతదేహాలను గుర్తించేందుకు అడ్డుగా ఉన్న బోరింగ్ మిషన్‌ను కటింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు లోకో ట్రైన్ ద్వారా శకలాలను బయటకు పంపిస్తున్నారు. ఇటీవల లభ్యమైన మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో మరో డెడ్ బాడీ ఉన్నట్లు గుర్తించిన రెస్క్యూ బృందాలు బయటకు తీసేందుకు శ్రమిస్తున్నాయి. కార్మికులకుపై పడిన బురద మట్టి, సున్నం మట్టి బిగుసుకుపోవడంతో మట్టిని తొలగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కేడవార్ డాగ్స్‌ను తెప్పించి మరోసారి సొరంగంలో పరిశీలించినా దుర్వాసన వల్ల మృతదేహాలను గుర్తించకపోయినట్టు తెలుస్తుంది. శుక్రవారం ఏడున్నర గంటల ప్రాంతంలో రెస్క్యూ బృందాలు మరోమారు టన్నెల్లోకి సహాయక చర్యలు చేపట్టేందుకు బయలుదేరాయి. రెస్క్యూ బృందాలు మధ్యాహ్నం తర్వాత బయటకు వచ్చే అవకాశం ఉండడంతో మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో ఉన్న మరో వ్యక్తి డెడ్ బాడీ వివరాలు తెలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం శివశంకర్ అనే ఓ ప్రత్యేక అధికారిని నియమించింది. గత మూడు రోజులుగా ఆయన సమక్షంలోనే రెస్క్యూ బృందాలు సొరంగంలో సహాయక చర్యలు చేపడుతున్నాయి.

## మళ్లీ పెరగనున్న మెట్రో చార్జీలు

### కేంద్రం అనుమతి కోరేందుకు ప్రయత్నాలు

హైదరాబాద్: మెట్రోకు ఈ మధ్యకాలంలో నష్టాలు వస్తుండటంతో హైదరాబాద్ మెట్రో రైలు టికెట్ రేట్లు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రం అనుమతి కోరేందుకు ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) సంస్థ అధికారులు ప్రయత్నిస్తున్నారు. రోజుకు కోటిన్నర రూపాయల నష్టం వస్తోందని, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అంతర్జాతీయ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు ఇప్పటికీ వడ్డీలు చెల్లించలేకపోతున్నామని ఎల్అండ్‌టీ సంస్థ చెబుతోంది. అయితే ప్రయాణికులపై అదనపు భారం వేయొద్దనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ధరల పెంపునకు సుముఖంగా లేదని తెలుస్తోంది. నగరంలో మొదటిదశ ప్రాజెక్టును ఎల్అండ్‌టీ సంస్థ నిర్మించిన విషయం తెలిసిందే. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యం (పీపీపీ)లో 2012లో రూ.14,132 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించి 2017 నవంబరులో పూర్తిచేశారు. మూడు కారిడార్ల పరిధిలో ప్రయాణించే వారి సంఖ్య రోజూ 5.10 లక్షలకు చేరింది. కరోనాకు ముందు రోజుకు రూ.80 లక్షలకు పైగా ఎల్ అండ్ టీ ఆదాయం సమకూర్చుకుంది. అయితే, 2020లో కరోనా లాక్‌డౌన్‌తో మెట్రో కుదేలైంది. 2022 నుంచి క్రమంగా కోలుకున్నా నష్టాల ఊబి నుంచి బయటపడలేదని చెబుతోంది. మెట్రో నిర్వహణలో రోజుకు సుమారు రూ.కోటిన్నర వరకు నష్టం వస్తున్నట్లు ఎల్ అండ్ టీ అధికారులు తరచూ చెబుతున్నారు. ఆశించినవిధంగా ప్రయాణికుల సంఖ్య రోజుకు 6 లక్షలకు పెరగకపోవడం, నిర్వహణ ఖర్చులు పెరిగిపోవడంతో నష్టాలు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. టికెట్ రేట్ల సవరణ విషయంపై హెచ్ఎంఆర్ సంస్థ, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం 2022 సెప్టెంబరులో కమిటీని నియమించింది. ఆ కమిటీ ప్రజాభిప్రాయాన్ని సేకరించి నివేదిక సమర్పించింది.

అదే సమయంలో 2023 జనవరి నుంచి రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం రావడంతో టికెట్ చార్జీల విషయం మరుగునపడింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా కేంద్రం అనుమతి కోరేందుకు హెచ్ఎంఆర్, ఎల్అండ్‌టీ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

మహాలక్ష్మి పథకం ద్వారా మెట్రోకు మహిళా ప్రయాణికుల సంఖ్య బాగా తగ్గిందని, కనీసం టికెట్ చార్జీలు పెంచుకునే అవకాశం కల్పిస్తే కొంతైనా నష్టాలను పూడ్చుకుంటామని ఎల్అండ్‌టీ కోరుతోంది. అయితే మెట్రో రెండో దశ నిర్మాణంపై దృష్టి సారించిన సర్కారు ఇప్పుడు కేంద్రానికి ఈ విషయం తెలియజేస్తే... అసలు లక్ష్యం దెబ్బతినే అవకాశం ఉందని భావిస్తోంది.

## కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల్లో అశాంతి



### అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్

### పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ :కాంగ్రెస్ పాలనలో ప్రజలు అశాంతిగా ఉన్నారని, ఈ పాలన ఎప్పుడు ఆగిపోతుందోనని ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. శాసనమండలిలో ఇవాళ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అప్పులపై కాంగ్రెస్ నేతల తప్పులు బయటపడ్డాయని అన్నారు. రాష్ట్రం అప్పులు మొత్తం రూ.4.42 లక్షలుగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని కవిత విమర్శించారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలని అన్నారు. అబద్దాలు చెబుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందని సూచించారు. ప్రజలు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల సమస్యలపై గళమెత్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతి రోజూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపామని గుర్తుచేశారు. కేసీఆర్‌పై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా సభలో నిరసన తెలిపామని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్‌పై తాము చేసిన పోరాటానికి ప్రభుత్వం దిగొచ్చిందని, ఎప్పటికప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేస్తామని మండలి సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారని చెప్పారు. ప్రకటించిన విధంగా సీఎం ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేసేవరకు తాము ప్రశ్నిస్తూనే ఉంటామని కవిత అన్నారు.

## మయన్మార్ రాజధాని నేపిడా అతలాకుతలం

**న్యూఢిల్లీ:** తాజా భూకంపం తీవ్రతకు మయన్మార్ రాజధాని నేపిడా అతలాకుతల మయ్యింది. అనేక భవనాలు కుప్పకూలాయి. మయన్మార్ దేశవ్యాప్తంగా చాలా చోట్ల భవనాలు, పాత వంతెనలు కుప్పకూలినట్లు వార్తలొస్తున్నాయి. ఇందులో ఓ వేయి పడకల ఆస్పత్రి కూడా ఉందన్న వార్త ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనలో ఎవరైనా మరణించిందీ, ఎంతమంది గాయపడ్డదీ తెలియాల్సి ఉంది. శిథిలాల కింద ఎందరున్నారన్న దానిపై ఆరా తీస్తున్నారు. సహాయక చర్యలు సాగుతున్నాయి. క్షతగాత్రుల సంఖ్య అధికంగానే ఇక్కడే ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ఇక్కడ అత్యధిక మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఓ ఆంగ్లవార్తా సంస్థ కూడా పేర్కొంది. చాలా మంది తమ ఆత్మీయుల కోసం శిథిలాల్లో గాలింపు కొనసాగిస్తున్నారు. నేపిడాలో క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న ఆసుపత్రిని మిలటరీ చీఫ్ మిన్ ఆంగ్ లయాంగ్ సందర్శించారు. శుక్రవారం ఉదయం మయన్మార్, థాయ్‌ల్యాండ్ సహా చైనా, భారత్, వియత్నాం తూర్పు ఆసియా దేశాల్లో 7.7, 6.4 తీవ్రతతో రెండు భూకంపాలొచ్చాయి. ఫలితంగా థాయ్‌ల్యాండ్, మయన్మార్‌లో భారీగా ఆస్తినష్టం సంభవించిది. మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మాండలే అనే ప్రదేశంలో మసీదు కూలి దాదాపు 20 మంది చనిపోగా.. టవుంగూలో పునరావాస కేంద్రం ధ్వంసమై మరో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఆ దేశ స్టాక్ ఎక్స్ఛేంజి కార్యకలాపాలను సస్పెండ్ చేశారు.

## యువకుడిని నరకిచంపిన యువతి తండ్రి ప్రేమ వ్యవహారంతోనే ఘటన



**పెద్దపల్లి:** పుట్టిన రోజే ఓ యువకుడిని యువతి తండ్రి గొడ్డలిలో అత్యంత దారుణంగా హత్య చేసిన సంఘటన జిల్లాలో కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామానికి చెందిన పూరేళ్ల సాయికుమార్ గౌడ్ (17) వేరే సామాజిక వర్గానికి చెందిన యువతి ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో సాయి తన పుట్టినరోజు వేడుకలు చేసుకుంటుండగా అక్కడకు వచ్చిన యువతి తండ్రి సాయిపై గొడ్డలితో వేటు వేశాడు. మొదట సాయి మెడపై అమ్మాయి తండ్రి వేటు వేయగా.. తీవ్రంగా గాయపడిన యువకుడు అక్కడిని నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు పరిగెత్తాడు. అయినప్పటికీ అతడిని వదలలేదు. సాయి కుమార్‌ను కాపాడటానికి స్నేహితులు కూడా వెనకే పరిగెత్తారు. కానీ బొడ్రాయి దగ్గర మళ్లీ వరుసగా సాయిపై గొడ్డలి పోట్లు పడ్డాయి. దీంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిని నరికిన వెంటనే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## అభివృద్ధి తెలంగాణ కాస్త.. ఆత్మహత్యల తెలంగాణగా మారింది

### 15 నెలల్లోనే రాష్ట్రం దివాలా : కేటీఆర్



**వరంగల్:** నాటి బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితే... 15 నెలలకాలంలోనే రాష్ట్రం దివాలా తీసిందని మాజీమంత్రి కేటీఆర్ విమర్శించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో సౌభాగ్యనగరంగా ఉన్న హైదరాబాద్ కాంగ్రెస్ ఏలుబడిలో అభాగ్యనగరంగా మారిందన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో నగరంలో ఇండ్ల కొనుగోళ్లు తగ్గాయని విమర్శించారు. అమ్మకాలు జరగకపోవడంతో రియల్టర్లు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. అన్నదాతలే కాదు అమాయక రియల్ వ్యాపారులు కూడా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. కూల్చడం కాదు కట్టడం నేర్చుకోవాలని, అబద్ధాలు చెప్పడం కాదు అభివృద్ధి చేయడం నేర్చుకోవాలని కాంగ్రెస్ పాలకులకు చురకలంటించారు. పేదల ఇండ్ల పైకి బుల్డోజర్లు, పెద్దల ఆస్తులతో సెటిల్మెంట్లు.

రియల్ ధమాల్.. ఇన్నా సజీవ సమాధి, మూసీ, హైడ్రా పేరుతో మూటలు కడుతున్న కాంగ్రెస్ గద్దలన్నారు. హైదరాబాద్‌లో గత త్రైమాసికంలో 49 శాతం విక్రయాలు తగ్గాయని తెలిపారు. ఇంకా కాంగ్రెస్ పాలనలో ఎన్ని దారుణాలు చూడాలోనని ఆందోళన వ్యక్తంచేశారు.

## హన్మకొండలో టాటూ గ్యాంగ్ హల్‌చల్

### భారీ దోపిడీకి పక్కా స్కెచ్.. ఓ ఇంట్లో భారీ దోపిడీ

### సీసీ కెమెరాల ఆధారంగా పోలీసుల దర్యాప్తు

### అంతర్రాష్ట్ర ముఠా పనేనని అనుమానాలు



**వరంగల్:** వరంగల్‌లో "టాటూ గ్యాంగ్".. భారీ దోపిడీ లకు పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగిన ఈ ముఠా టార్గెట్ చేసింది.. విశాలంగా ఉంటే ధనవంతుల ఇళ్లను టార్గెట్ చేసి లూటీలకు బరితెగి స్తోంది.. తాజాగా హనుమకొండ పరిధిలోని ఓ ఇంట్లో భారీదోపిడీకి ప్రయత్నం చేశారు.. అదృష్టవశాత్తు ఆ ఇంట్లో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.. సీసీ కెమెరా ఫుటేజ్ చూసి షేక్ అయిన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యారణ్యపురిలో జరిగిన రాబరీ నగరమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది..సీసీ కెమెరా ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు ఒక్కసారిగా షాక్ అయ్యారు.. ఈ దోపిడికి పాల్పడిన ముఠా మామూలు దొంగలు కాదని కరడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా అని గుర్తించారు.. మొత్తం ఆరుగురు వ్యక్తులు ముసుగులు ధరించి దోపిడీలకు పాల్పడ్డారు.. వాళ్ళ ఒంటిపై ప్రతి ఒక్కరి ఎడమ చేతిపై పచ్చబొట్టు, చేతిలో మారణాయుధాలు కలిగి ఉండడం చూసి ఇదేదో డిఫరెంట్ డేంజర్ గ్యాంగ్‌గా భావిస్తున్నారు. విద్యారణ్యపురిలో దోపిడీకి పాల్పడిన ఈ ముఠా ఆ ఇంటి కిటికీ గ్రిల్స్ ధ్వంసంచేసి ఇంట్లోకి ప్రవేశించారు.. విలువైన వస్తువులు దొంగిలించారు.. సీసీ కెమెరాల్లో వాళ్ల దోపిడి దృశ్యాలు అంతా రికార్డయ్యాయి. అర్ధరాత్రి దోపిడికి పాల్పడిన ముఠా రెండున్నర గంటలపాటు ఆ ఇంట్లోనే గడిపినట్టుగా సీసీ కెమెరా ఫుటేజ్‌లో లభ్యమైన ఆధారాలను బట్టి పోలీసులు గుర్తించారు.. ఈ ముఠా ఇంట్లోకి ప్రవేశించిన సమయంలో ఆ ఇంట్లోని వారు గాఢ నిద్రలో ఉన్నారు.

## తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ..

> దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ... చరిత్రలో నిలవబోతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

హైదరాబాద్: దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ... చరిత్రలో నిలవబోతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో దాదాపు 84 శాతం మంది పేదలకు ఉచితంగా సన్నబియ్యం అందించబోతున్నామని చెప్పారు. ఉగాది రోజున ఆదివారం హుజూర్‌నగర్ వేదికగా ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి అర్హులందరికీ రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా మరో 30 లక్షల మందిని రేషన్‌కు అర్హులుగా గుర్తించబోతున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఆయన హుజూర్‌నగర్‌లో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించి వచ్చి సచివాలయంలో సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. పేదలకు త్వరలో ఉప్పు, పప్పు, చింతపండు వంటి సరకుల్ని కూడా రేషన్‌దుకాణాల ద్వారా అందిస్తామని, క్రమక్రమంగా సరకుల సంఖ్య పెంచుతామని మంత్రి వెల్లడించారు. "దొడ్డుబియ్యం స్థానంలో సన్నబియ్యం పంపిణీ వల్ల రాష్ట్రంపై రూ.2,800 కోట్ల అదనపు భారం పడనుంది. ఆ భారాన్ని భరించాలని కేంద్రాన్ని కోరా. ప్రతి లబ్ధిదారుకు 6 కిలోల బియ్యం ఇస్తాం. తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చు. అధికారుల వద్ద ఉన్న జాబితాలో పేరుంటే కార్డులేకపోయినా రేషన్ తీసుకోవచ్చు. నా సుదీర్ఘ రాజకీయ అనుభవంలో ఇంత మంచి సంక్షేమ పథకాన్ని చూడలేదు.ప్రధాని ఫొటో గురించి ఇంకా నిర్ణయం తీసుకోలేదు అందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతున్నాం. బీపీఎల్ కుటుంబాల వారికి ఇచ్చేది మూడు రంగులతో, ఏపీఎల్ కుటుంబాలకు ఇచ్చేది ఆకుపచ్చ రంగుతో ఉంటుంది. వాటిపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. చిప్ ఉండదు. కొత్తవి ప్రింటింగ్‌కు ఇచ్చాం. రేషన్‌కార్డుపై ప్రధాని ఫొటో గురించి ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కొత్తగా జారీచేసే వాటితో కలిపి రాష్ట్రంలో రేషన్‌కార్డుల సంఖ్య కోటికి, లబ్ధిదారులు 3.10 కోట్ల మంది అవుతారని అంచనా వేస్తున్నాం. భారాస నికరంగా ఇచ్చిన కార్డులు 49 వేలే

సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన రూ.500 బోనస్‌తో కొనుగోలు చేసిన సన్నధాన్యాన్ని మిల్లింగ్ చేయించి రేషన్ కార్డుదారులకు ఇవ్వబోతున్నాం. 2014 నాటికి రాష్ట్రంలో కార్డుల సంఖ్య 89,73,708. భారాస ప్రభుత్వం పదేళ్లకాలంలో తీసేసిన, ఇచ్చిన కార్డులను లెక్కేస్తే నికరంగా ఇచ్చినవి 49,479. కుటుంబ సభ్యుల పేర్లు చేర్చేందుకు గత ప్రభుత్వ హయాంలో వచ్చిన దరఖాస్తులనూ మేం పరిష్కరిస్తున్నాం. సన్న బియ్యాన్ని రాష్ట్ర అవసరాలకే వాడతాం. ఎఫ్‌సీఐకి ఇవ్వం. దొడ్డు బియ్యం మాత్రమే ఇస్తాం" అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. సమావేశంలో పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, డైరెక్టర్ ప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేగుచుక్క

# సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలి.

**ప్రభుత్వ సలహాదారు పోచారం, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.**

**పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష.**



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 28**

నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్ధాపూర్ వద్ద చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సిద్ధాపూర్ రిజర్వాయర్ పనుల ప్రగతిపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్, ల్యాండ్ అండ్ సర్వే తదితర శాఖల అధికారులతో ప్రభుత్వ సలహాదారు పోచారం, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సమీక్ష జరిపారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ డీ.ఎఫ్.ఓ వికాస్ మీనా, కామారెడ్డి ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న పనుల స్థితిగతుల గురించి అధికారులు పోచారం దృష్టికి తెచ్చారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. ఎలాంటి సాగునీటి వసతి లేని తండాలు, అనేక గ్రామాలకు ఈ రిజర్వాయర్ వరప్రదాయినిగా నిలువనుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పనులను పూర్తి చేసేందుకు అంకిత భావంతో కృషి చేయాలని అధికారులకు హితవు పలికారు. అటవీ భూముల సేకరణ ఇబ్బందికరంగా ఉన్న చోట ప్రత్యామ్నాయ మార్గాలను అవలంభిస్తూ పనులకు ఆటంకాలు ఏర్పడకుండా ముందుకెళ్లాలని సూచించారు. అవసరమైతే నిర్ణీత రిజర్వాయర్ నిర్మాణ ప్రణాళికలో స్వల్ప మార్పులతోనైనా పనులను చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చొరవ చూపాలన్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం ఆవశ్యకత గురించి ప్రభుత్వానికి సైతం వివరించగా, అన్ని విధాలుగా తోడ్పాటును అందజేస్తుందని అన్నారు. సరిపడా నిధులు అందుబాటులో ఉన్నందున పనులలో జాప్యానికి తావులేకుండా చూడాలన్నారు. జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకం కోసం డెలివరీ చాంబర్ల నిర్మాణానికి అవసరమైన కొద్దిపాటి స్థలాన్ని ఇరిగేషన్ అధికారులకు కేటాయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల విషయంలో క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఏర్పడినా

వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఈ పథకం ప్రాధాన్యతను గుర్తిస్తూ, ఇప్పటికే సుమారు 280 పైచిలుకు ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందన్నారు. ఇంకనూ అక్కడక్కడా స్వల్ప మొత్తంలో అవసరమైన స్థలాన్ని కూడా కేటాయించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి వీలుగా విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని, పనులలో వేగాన్ని పెంచి నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు.

వివిధ ప్రాంతాలలో ఏక కాలంలో కొనసాగుతున్న పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, నాణ్యతతో పనులు జరిగేలా చూడాలన్నారు. సమీక్షా సమావేశంలో ఎఫ్.డీ.ఓ భవానీ శంకర్, ఆయా మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల ఆహ్వానం.

**జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 28**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "రాజీవ్ యువ వికాసం" స్వయం ఉపాధి పథకాలకు నిజామాబాద్ జిల్లాలోని వెనుకబడిన వర్గాల బీ.సీ, ఈ.బీ.సీ, (ఈ.డబ్ల్యూ.ఎస్), ఫెడరేషన్ లకు చెందిన నిరుద్యోగ యువతీ/ యువకులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు రుణం పొందవచ్చని అన్నారు. 50 వేల రూపాయల లోపు విలువ చేసే యూనిట్ కు 100 శాతం సబ్సిడీ వర్తిస్తుందని, లక్ష రూపాయల లోపు యూనిట్ కు 90 శాతం సబ్సిడీ, 2 లక్షల యూనిట్ కు 80 శాతం సబ్సిడీ, 4 లక్షల వరకు విలువ చేసే యూనిట్ కు 70 శాతం సబ్సిడీ వర్తిస్తుందని వివరించారు. అభ్యర్థులు వ్యవసాయేతర పథకాలకు సంబంధించిన యూనిట్ల స్థాపనకై 21-55 ఏళ్ళ వయస్సు, వ్యవసాయ ఆధారిత పథకాలకు 21-60 ఏళ్ళ వయసు కలిగి ఉండాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నట్లయితే కుటుంబ వార్షిక ఆదాయము రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షల లోపు ఉన్న వారు అర్హులని, బ్యాంక్ సమ్మతి తప్పనిసరిగా ఉండాలన్నారు. దరఖాస్తుకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, విధ్యార్హతలు, బ్యాంక్ ఖాతా ప్రతులను తప్పనిసరిగా జత చేయవలెనని అన్నారు. ఆసక్తి గల వెనుకబడిన వర్గాల నిరుద్యోగ యువతీ, యువకులు %ఫ్ట్రీజూం:ౕ/స్త్రశీఎఎఎంఅవష.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ% వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్లో 2025 ఏప్రిల్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్ లైన్లో అప్ లోడ్ చేసిన దరఖాస్తులను అర్జీదారు డౌన్ లోడ్ చేసుకొని, దరఖాస్తుకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, విద్యార్హతలు, బ్యాంక్ ఖాతా ప్రతులను జత చేసి సంబంధిత మండల ఎంపిడిఓ లకు, మున్సిపల్ కార్యాలయములో అందజేయాలన్నారు. ఇట్టి అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వెనుకబడిన వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# కారులో మహిళ డెడ్ బాడీ తరలింపు.

- పోలీసులు తనిఖీల్లో పట్టుబడ్డ నిందితులు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 28:**



ఓ కారులో మహిళ డెడ్ బాడీ తరలింపు నిజామాబాద్ జిల్లాలో కలకలం రేపింది. నగర శివారులో మహిళ ను హత్య చేసి డెడ్ బాడీనీ కారు డిక్కీ లో తరలించారు హంతకులు. నగర శివారు లోని దాస్ నగర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కారు ఆపకుండా వెళ్లడంతో అనుమానం వేసిన పోలీసులు కారును వెంబడించారు. మృత దేహాన్ని కెనాల్ లో పడేస్తుండగా పట్టుకున్నారు. మృతురాలు ముబారక్ నగర్ కు చెందిన కమల (46) గా గుర్తించారు. కారు స్వాధీనం, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**నగల కోసం హత్య ?.**

పదేళ్ల క్రితం పద్మ అనే మహిళతో కమలకు పరిచయం కాగా ఇటీవల కమలను పద్మ అప్పు అడిగినట్టు తెలిసింది. అప్పు ఇవ్వక పోగా, కమల భర్త ఇటీవల 2 తులాల బంగారు గొలుసును కమలకు చేయించాడు. నగల పై కన్నేసిన పద్మ, పద్మ పెద్ద కుమారుడు గురువారం కమలను కారులో తీసుకెల్లినట్టు సమాచారం. ఇదే క్రమంలో మద్యం తాగించి కమలను హత్య చేసినట్టు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సింది ఉంది.

# ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలి.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 28:**

రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో దండి వెంకట్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్లు మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులంతా బహుజన శ్రామిక కులాలకు చెందిన వారు కాబట్టి గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల పట్ల కుల వివక్షతతో కూడిన శ్రమ దోపిడి చేస్తున్నాయని విమర్శించారు.

# రైతుల గోస వినని కాంగ్రెస్.

**- ప్రభుత్వంపై ధ్వజమెత్తిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 28:**

రైతుల గోస వినని కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకుంటుందని ప్రభుత్వంపై అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ ధ్వజమెత్తారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ధర్నా చౌక్ లో నిర్వహించిన రైతు సత్యాగ్రహ దీక్షలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని చేసిన హామీలు ఎక్కడిపోయాయని ప్రశ్నించారు. పంటలకు నీరు లేక రైతులు కష్టాల్లో ఉన్నా ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిజాం సుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై ప్రభుత్వం మౌనంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో రైతులకు ఒక్క రూపాయి కూడా ఆర్థిక సాయం అందించలేదని, ప్రభుత్వం నిర్వాకం వల్ల రైతులు కంట నీరు పెడతున్నారని మండిపడ్డారు. అకాల వర్షాలు, కరెంట్ కొరత కారణంగా పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని, ఎకరానికి రూ.30,000 నష్టపరిహారం, రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15,000 రైతు భరోసా, వరివరికో రూ.500 బోనస్




అందించాల్సిందిగా డిమాండ్ చేశారు.

ఇటీవల నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటుపై కాంగ్రెస్ నేతలు అసహనం చూపుతున్నారని, కానీ పసుపు రైతులకు ఇది ఎంతో ఉపయోగకరమని అన్నారు. గతంలో పసుపు రైతుల కోసం రోడ్డెక్కిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు మౌనంగా ఉండటం దురదృష్టకరమన్నారు. వరి కోతలు ప్రారంభమైనందున వెంటనే ఐకేపీ కేంద్రాలు ప్రారంభించి, సకాలంలో కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. బస్తాలు, లారీలు తదితర సదుపాయాలు సమకూర్చాలని అన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# కారు డబ్బుల విషయమై ఒకరిని హత్య.

**నిందితుల అరెస్టు. కామారెడ్డి ఏఎస్పి చైతన్య రెడ్డి వివరాలు వెల్లడి.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మార్చి 28**

: కారు డబ్బుల విషయమై ఒకరిని హత్య చేసిన కేసులో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు కామారెడ్డి ఏఎస్పి చైతన్య రెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. దోమకొండ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన ఈరవేని రమేష్ తన భార్య పేరును ఉన్న మారుతి స్విఫ్ట్ కారును చింతామన్ పల్లి గ్రామానికి చెందిన పల్లె పోచయ్య గత సంవత్సరం డిసెంబర్ నెలలో 3,85,000 రూపాయలకు కొనుగోలు చేశాడు. అప్పటినుంచి ఒకసారి 26300, ఈఎంఐ 13150 రూపాయల చొప్పున మొత్తం 65750 రూపాయలు ఫైనాన్సుకు పోచయ్య చెల్లించాడు. తర్వాత 1,36,000 రమేష్ కు నగదు ఇచ్చాడు. మిగతా డబ్బులు కూడా ఇవ్వాలని పోచయ్యను అడగగా, మొత్తం ఫైనాన్స్ క్లియర్ చేసి ఇస్తే మిగతా డబ్బులు ఇస్తానని రమేష్ తో గొడవ పడ్డాడు.

ఈ నెల 25న రమేష్ తన భార్య అనిత, పోచయ్య ముగ్గురు కలిసి ఫైనాన్స్ క్లియర్ చేసేందుకు కామారెడ్డి మహీంద్రా ఫైనాన్స్ కు రాగా.. మొత్తం లక్ష 85 వేలు చెల్లిస్తే ఫైనాన్స్ క్లియర్ అవుతుందని చెప్పడంతో పోచయ్య దానికి ఒప్పుకుని నాలుగైదు రోజుల్లో క్లియర్ చేస్తానని ఒప్పుకున్నాడు. మళ్ళీ 26న పోచయ్య వద్దకు వెళ్లిన రమేష్ డబ్బులు తనకే ఇవ్వాలని గోడవపడి వెళ్ళిపోయాడు. గురువారం చింతామన్ పల్లి శివారులో గల తన ఇటుక బట్టి వద్ద కారును నిలిపి బట్టి వద్ద ఉన్న గదిలో పోచయ్య ఫోన్ చూస్తూ ఉండగా తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కారు ఓపెన్ అయిన శబ్దం వచ్చి పోచయ్య బయటకు వచ్చి చూడగా రమేష్ కారును తీసుకుని వెళు_న్నాడు. వెంటనే కారును ఆపిన పోచయ్య కారులో ఉన్న రమేష్ ను బయటకు లాగి కాలర్ పట్టుకోగా బట్టిలో పని చేస్తున్న



ఒడిస్సాకు చెందిన కూలీలు వచ్చి విడిపించారు. వెంటనే పోచయ్య పక్కనే ఉన్న కర్ర తీసుకుని రమేష్ తలపై బలంగా కొట్టడంతో పడిపోయిన రమేష్ ను ఎలాగైనా చంపాలన్న ఉద్దేశ్యంతో రమేష్ కాళ్ళు చేతులు కట్టేసి పోచయ్య తన అల్లుడు, కూలీలతో కలిసి తీవ్రంగా కొట్టారు. తమకు ఏమి తెలియనట్టు రమేష్ కులస్తుడు రాములుకు ఫోన్ చేసి రమేష్ ఇక్కడ పడి ఉన్నాడని చెప్పి, వెంటనే 100 కు కాల్ చేసి గొడవ జరుగుతుందని చెప్పి అక్కడినుంచి పారిపోయారు. పోలీసులు, రమేష్ భార్య వచ్చి రమేష్ ను ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలో మృతి చెందాడని ఏఎస్పీ తెలిపారు. రమేష్ హత్యకు కారణమైన పోచయ్య, అతని అల్లుడు హరీష్, ఇటుక బట్టి కూలీలు రాజ్ కుమార్, రమేష్, బిదేశి నాయక్ లను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో భిక్కనూర్ సీఐ సంపత్, దోమకొండ ఎస్సై ప్రవంతి పాల్గొన్నారు.

# థాయ్‌లాండ్, మయన్మార్‌లలో భూ విలయం

బ్యాంకాక్: నిమిషాల వ్యవధిలో వెంట వెంటనే వచ్చిన రెండు భారీ భూకంపాలు థాయ్‌లాండ్, మయన్మార్ దేశాల్లో పెను విధ్వంసం సృష్టించాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం రెండు దేశాల్లో 150 మందికి పైగా ప్రజలు మృతి చెందారు. 750 మందికి పైగా గాయపడ్డారు. అయితే మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పలు భవనాలు, ప్రార్థనాలయాలు, సాధువుల మఠాలు కుప్పకూలాయి. ప్రాణ నష్టం అత్యధికంగా మయన్మార్‌లోని మాండలే నగరం, దాని పరిసర ప్రాంతాల్లో జరిగింది. రెండు భూకంపాల కేంద్ర స్థానాలూ ఇక్కడికి సమీపంలోనే ఉన్నాయి. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. రెండు దేశాల్లోనూ అక్కడి ప్రభుత్వాలు వివిధ ప్రాంతాల్లో ఆత్యయిక పరిస్థితిని ప్రకటించాయి. ప్రకృతి విపత్తులో చిక్కుకున్న ఈ దేశాలకు చేయూత అందిస్తామని భారత ప్రధాని మోదీ తెలిపారు. సహాయక చర్యలకు అండగా నిలుస్తామన్నారు. భూప్రకంపనల ప్రభావం భారత్‌తో పాటు చైనా, బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లోనూ కనిపించింది.మయన్మార్, థాయ్‌లాండ్‌లలో క్షతగాత్రులైన వారికి చికిత్స అందించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ముందుకొచ్చింది. శుక్రవారం ఉదయం 11.50 గం.లకు సంభవించిన తొలి భూకంపం కేంద్రం మయన్మార్‌లోని సాగాయింగ్ పట్టణానికి 12 కి.మీ. దూరంలో ఉంది. మధ్యాహ్నం 12.02లకు వచ్చిన రెండో భూకంపం కేంద్రం కయక్స్ పట్టణానికి 20 కి.మీ.దూరంలో ఉంది. భూ ఉపరితలానికి 10.కి.మీ లోతులోనే ప్రకంపన కేంద్రాలు ఉండడంతో నష్ట తీవ్రత అధికంగా ఉందని అమెరికాకు చెందిన జియోలాజికల్ సర్వే సంస్థ వెల్లడించింది.మృత్యు కూపం మాండలే

వరుస భూకంపాల వల్ల మయన్మార్‌లోని మాండలే నగరం, దాని పరిసర ప్రాంతాల్లో కనీసంగా 144 మంది చనిపోయారు. 730 మంది గాయపడ్డారు. పలు భవనాలు, ఆలయాలు, గోపురాలు, 90 ఏళ్ల నాటి వంతెన, ఒక డ్యామ్ కుప్పకూలాయి. మయన్మార్ రాజధాని నేపిడాలో ఇటీవలే నిర్మించిన వెయ్యి పడకల ఆస్పత్రి ధ్వంసమయ్యింది. పలు రహదారులు బీటలువారాయి. మయన్మార్‌లోని సైనిక పాలకులు అంతర్జాతీయ సమాజం సాయం అర్థించారు. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ గుటెర్రెస్ స్పందిస్తూ...తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. అంతర్యుద్ధంలో తలమునకలైన మయన్మార్‌లో వివిధ ప్రాంతాల నుంచి ఇంకా సమాచారం అందాల్సి ఉన్నందున ప్రాణ, ఆస్తి నష్టాల తీవ్రత పెరగవచ్చని భావిస్తున్నారు.పేకమేడలా కూలిన ఆకాశ హర్మ్యం మరో చోట భారీ భవనం కుప్పకూలగా.. శిథిలాల కింద ఓ కార్మికుడు ఆర్తనాదాలు చేస్తూ కనిపించాడు. సహాయక బృందాలు రంగంలోకి దిగి రక్షణ చర్యలు చేపట్టాయి. సైరన్ల మోతతో బహుళ అంతస్తుల భవనాలను వీడి ప్రజలు ప్రాణ భయంతో రోడ్లపైకి పరుగులు తీస్తూ వస్తోన్న దృశ్యాలు వ్యాప్తిలోకి వచ్చాయి. బ్యాంకాక్ నగరంలో వివిధ భవనాలు కూలిన ఘటనల్లో 10 మంది కార్మికులు మృతి చెందగా 101 మంది గల్లంతైనట్లు ఆ దేశ రక్షణ మంత్రి వెల్లడించారు. 16 మంది గాయపడ్డారు.తొలిసారి ప్రకంపనలు రాగానే బ్యాంకాక్‌లో మెట్రో సేవలను నిలిపివేశారు. దీంతో భారీ ప్రమాదం తప్పినట్లైంది. రెండో సారి ప్రకంపనలకు మెట్రో రైళ్లు కూడా ఊగిపోయాయి.చాలా భవనాలకు పగుళ్లు ఏర్పడటంతో ఉద్యోగులు, ప్రజలు వాటిల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారు.

# ఆహారధాన్యాల దిగుమతులు దేశీయంగా రైతుకు సవాల్

న్యూఢిల్లీ: దేశంలో ఆహర ధాన్యాల దిగుమతులపై దృష్టి సారించాలి. అంతేగాకుండా సమీక్షించుకోవాలి. మనదేశంలో అన్నిరకాల ధాన్యం పండుతున్న దిగుమతులు చేసుకోవడం, ఇక్కడి రైతులకు భరోసా లేకుండా చేయడం సరికాదు. అలాగే ప్రజలకు కూడా సరసమైన ధరలకు ఆహారా ధాన్యలు దక్కడం లేదని గుర్తించాలి. రైతులను ప్రోత్సహించడం ద్వారా అన్నిరకాల పంటలు పండించే అవకాశం ఉన్న భూములను ఉపయోగించుకోవాలి. రైతులను ప్రోత్సహిస్తే అన్నిరకాలు పంటలు పండిస్తారు.అందుకు మన భూములు అనుకూలంగా ఉన్నాయి.గతంలో రికార్డు స్థాయిలో 97 మిలియన్ టన్నుల గోధుమ ఉత్పత్తి అయిన నేపథ్యంలో, కేవలం 8 లక్షల టన్నుల గోధుమలను ఉక్రెయిన్, రష్యా నుంచి జీరో డ్యూటీతో దిగుమతి చేయడం ఆర్థికంగా అర్థరహితం. రైతులు గిట్టుబాటు ధర లేక

ఉల్లిపాయలను వీధుల్లో పారేసిన ఘటనలు ఇంకా మనం మర్చిపోలేదు. ఇదిలా ఉండగా, గతంలో పండుగల సమయంలో ప్రభుత్వం 3 లక్షల టన్నుల చక్కెరను 25 శాతం డ్యూటీని తగ్గించి మరీ దిగుమతి చేసుకునేందుకు అనుమతించింది. పప్పు ధాన్యాలు దేశంలో విరగపండిన సమయంలో అది జరిగిందని నివేదిక వివరించింది. దీనితో ధరలు పడిపోయి, రైతులు అత్యంత చౌకగా తమ ఫలసాయాన్ని అమ్ముకోవలసి వచ్చింది.ఒక్క శనగ పప్పు మినహా మిగిలిన పప్పు ధాన్యాలు అన్నింటిపై రైతులకు లాభంలో మార్జిన్ 30 శాతం పడిపోయింది. ఇదే తరహా ధరలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దేశంలో ఈసారి పండిన పెసర, కందిపప్పుకు కొనుగోలుదారులు లభ్యం కావడం లేదు. హోల్ సేల్ ధరలు పెరగకపోవడంతో పరిస్థితి ఆశాజనకంగా లేదు. భారత దేశం ఇప్పటికే లక్షల టన్నుల పప్పు ధాన్యాలను మొజాంబిక్ నుంచి దిగుమతి చేసుకునేందుకు ఒప్పందంపై సంతకాలు చేసింది. రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా నుంచి పప్పు ధాన్యాలు, నూనె గింజలను దిగుమతి చేసుకునేందుకు సంప్రదింపులు జరుపుతోంది. అమెరికా వ్యవసాయ శాఖ భారత్ సోయాబీన్ దిగుమతులను పెంచుకోవాలని సూచించ డంతో, వంట నూనెల దిగుమతులపై పెంచిన సుంకాన్ని గణనీయంగా తగ్గించడమంటే, వ్యవసాయ ఔట్‌సోర్సింగ్ అనేది మినహాయింపుగా కాక విధానమైపోయింది.

ఇది మన ఆహార స్వయం పోషకత్వానికే కాదు కోట్లాది సన్నకారు రైతుల జీవనోపాధికి ముప్పుగా పరణమించింది. ఇలాంటి విధానాలను

సమీక్షించుకోవాల్సిన సమయంఉంది. అప్పుడేరైతులకు మేలు జరుగుతుంది. ఆహారాన్ని దిగుమతి చేసుకోవడం అంటే నిరుద్యోగాన్ని దిగుమతి చేసుకోవడమే అన్న వాదనలో వాస్తవం గ్రహించాలి. చౌకైన దిగుమతులను అనుమతించడమంటే, వ్యవసాయం నుంచి రైతులను బలవంతంగా బయిటకు పంపడమే. పంటలు దిగుబడులు సమయంలో దిగుమతులు వెల్లవలా వచ్చిపడటాన్ని ఎలా సమర్థించుకుంటారు. అందువల్ల ధాన్యం ఉత్పత్తి, దిగుమతులు, ఎగుమతులు తదితర అంవాలపై స్పష్టమైన వ్యయసాయ విధానం రూపొందించుకుటే తప్పమనం సంక్షోభం నుంచి బయటకురాలేం.

# ఓవర్సీస్‌లో ‘కోర్ట్’ హవా..

## నిర్మాతగానూ నాని రికార్డు!




హర్ష్ రోషన్, శ్రీదేవి, ప్రియదర్శి, శివాజీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘కోర్ట్’. వాల్ పోస్టర్ సినిమా పతాకంపై నాని సమర్పణలో ఇది తెరకెక్కింది. చిన్న సినిమాగా ప్రేక్షకుల ముందుకువచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే కలెక్షన్ల విషయంలో పలు రికార్డులు తన ఖాతాలో వేసుకోగా.. తాజాగా ఓవర్సీస్‌లోనూ మరో ఘనత సాధించింది.

ప్రీ సేల్ బుకింగ్స్‌లోనే మంచి కలెక్షన్లు రాబట్టిన కోర్ట్ విదేశాల్లో తాజాగా వన్ మిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరింది. ఈవిషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ పోస్ట్ పెట్టింది. చిన్న సినిమాలకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొంది. అలాగే గతంలో నాని హీరోగా తెరకెక్కిన సినిమాలు వన్ మిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరాయి. ఇప్పుడు నిర్మాతగానూ ఈ మార్క్‌ను అందుకొని ఈ హీరో రికార్డు నెలకొల్పాడని అభిమానులు సంబరపడుతున్నారు. ఈ సినిమా విజయంపై నాని ఇటీవల మాట్లాడారు. తెలుగు సినిమాలపై అభిప్రాయాలను మార్చుకునేందుకు ‘కోర్ట్’ సరికొత్త నిర్వచనం ఇచ్చిందన్నారు. తెలుగు ప్రేక్షకుల విషయంలో గర్వపడుతున్నట్లు చెప్పారు.



## అసలు పేరుతో చిరంజీవి



చిరంజీవి హీరోగా తాను తెరకెక్కించనున్న సినిమాకి సంబంధించి దర్శకుడు అనిల్ రావిపూడి అప్‌డేట్ ఇచ్చారు. సోషల్ మీడియాలో పోస్టు పెట్టి, అభిమానుల్లో ఆసక్తి రేకెత్తించారు. “స్క్రిప్టు వినిపించడం పూర్తయింది. గ్రీన్ సిగ్నల్ వచ్చింది. చిరంజీవి గారికి నా కథలో పాత్ర ‘శంకర్ వరప్రసాద్’ని పరిచయం చేశా. ఆయనకు ఆ రోల్ బాగా నచ్చింది. ఇంకెందుకు ఆలస్యం.. మంచి ముహూర్తంతో.. ‘చిరు’నవ్వుల పండగబొమ్మకి శ్రీకారం” అని పేర్కొన్నారు.


చిరంజీవి అసలు పేరు శివశంకర వరప్రసాద్ అన్న సంగతి తెలిసిందే. అనిల్ ఇచ్చిన అప్‌డేట్‌ని బట్టి.. ఈ కొత్త సినిమాలో చిరంజీవి.. శంకర్ వరప్రసాద్‌గా నటించనున్నారని అర్థమవుతోంది. ‘సంక్రాంతికి వస్తున్నాం’ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనున్న చిత్రమిదే. కామెడీ, యాక్షన్ అంశాల మేళవింపుగా రూపొందనుంది. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్లకు అవకాశం ఉండగా.. ఓ పాత్ర కోసం అదితిరావు హైదరి పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. భీమ్స్ సంగీతం అందిస్తున్నారు. మరోవైపు, చిరంజీవి ‘విశ్వంభర’లో నటిస్తున్నారు. ‘బింబిసార’ ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. ‘దసరా’ దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో ఓ సినిమా చేయనున్నారు.



## రజనీకాంత్, అమితాబ్‌లతో నాకు పోటీ లేదు: మోహన్‌లాల్

ప్రస్తుతం ఇండస్ట్రీ అంతా ‘ఎల్2: ఎంపురాన్’ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ సినిమా మార్చి 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మోహన్‌లాల్ తనకు రజనీకాంత్, అమితాబ్ బచ్చన్‌లతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. వారితో తనకు పోటీ లేదన్నారు. “నేను ట్రైలర్‌ను రజనీకాంత్, అమితాబ్ బచ్చన్‌లకు పంపాను. వారు నిజంగా ప్రశంసించారు. రజనీకాంత్ ప్రత్యేకంగా ఫోన్ చేసి మాట్లాడారు. ట్రైలర్‌లో లొకేషన్స్ బాగున్నాయని చెప్పారు. సినిమా కోసం మేం ఖర్చు చేసిందంతా లొకేషన్స్‌లో కనిపిస్తుందని అభినందించారు. నటుడిగానే కాకుండా.. నిర్మాత కోణంలోనూ ఈ ట్రైలర్‌ను చూశారు. అందుకే మా కష్టం ఆయనకు సులభంగా అర్థమైంది. ఆయన ఎప్పుడూ మనస్ఫూర్తిగా అభినందిస్తారు” అని






## ఎక్కడికెళ్లినా నా ప్రాతినిధ్యం తెలుగుకే!

తెలుగమ్మాయిలు కథానాయికలుగా రాణించడం అరుదు. అలాంటి పరిస్థితుల్లో ఓ అచ్చ తెలుగమ్మాయి స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తన అందం.. ప్రతిభతో ప్రేక్షకుల్ని కట్టిపడేస్తూ... వరుస అవకాశాల్ని సొంతం చేసుకొంటోంది. ఆ కథానాయికే.. శ్రీలీల. కెరీర్‌ని పరుగులు పెట్టిస్తున్న ఈమె ఇటీవల నితిన్‌తో కలిసి ‘రాబిన్‌హుడ్’లో నటించింది. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. తెలుగు చిత్ర పరిశ్రమ నా ఇల్లు. ఎక్కడికి వెళ్లినా నేను తెలుగమ్మాయినే, నా ప్రాతినిధ్యం తెలుగుకే. ఇతర భాషల్లో అవకాశాలు వచ్చినా, అన్ని భాషల్నీ బ్యాలెన్స్ చేస్తాను తప్ప, ఎక్కడికో వెళ్లిపోవడం అంటూ ఉండదు. చదువుకుని రావడానికని వేరే ఊరికి వెళుతున్న మన అమ్మాయికి ఎలా జాగ్రత్తలు చెప్పి పంపిస్తామో, అలా నాకూ చెబుతున్నారు ఇప్పుడు. ఓ తెలుగమ్మాయిగా అందరూ గర్వపడేలా చేయాలన్నదే నా అభిమతం.



## నవ్వులు పూయించేలా ‘మ్యాడ్ స్క్వేర్’ ట్రైలర్

సంగీత్ శోభన్ , నార్నే నితిన్, రామ్ నితిన్ హీరోలుగా నటించిన ‘మ్యాడ్ స్క్వేర్’ మూవీ ట్రైలర్ కాస్తంత దోబూచులాట తర్వాత ఎట్టకేలకు బుధవారం విడుదలైంది. సినీ అభిమానుల సమక్షంలో ట్రైలర్ ను రిలీజ్ చేశారు. టీజర్ తో పోల్చితే... ఆ స్థాయిలో పంచ్ డైలాగ్స్ లేకపోయినా... ఈ ట్రైలర్ నూ ఫన్ జనరేట్ అయ్యేలా మేకర్స్ రూపొందించారు. ముందు నుండి నిర్మాత నాగవంశీ చెబుతున్నట్టుగానే ఈ సినిమాలో కథేమీ పెద్దగా ఉన్నట్టు అనిపించడం లేదు. అయితే ఏదో ఓ అంశాన్ని మాత్రం హైడ్ చేసినట్టు ఈ ట్రైలర్ చూస్తుంటే తెలుస్తోంది. మ్యాడ్ స్క్వేర్ మూవీకి భీమ్స్ సిసిరోలియో స్వరాలు అందిస్తే... తమన్ నేపథ్య సంగీతం సమకూర్చాడు. విడుదలైన కొద్ది సమయంలోనే ‘మ్యాడ్ స్క్వేర్’ ట్రైలర్ సోషల్ మీడియాలో వైరల్ గా మారిపోయింది. ఈ చిత్రం మార్చి 28న జనం ముందుకు వస్తోంది.

## కనులే చెబితే, మనసే వినదా అంటున్న చాందినీ చౌదరి

విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా ‘సంతాన ప్రాప్తిరస్తు’. ఈ మూవీని మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు షేక్ దావూద్ జి స్క్రీన్ ప్లే అందించారు. యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే థియేటర్లలో సందడి చేయబోతోంది. తాజాగా ఈ మూవీ మ్యూజికల్ ప్రమోషన్స్ ను మేకర్స్ ప్రారంభించారు. అందులో భాగంగా బుధవారం ‘నాలో ఏదో...’ అనే ఫస్ట్ సింగిల్ ను రిలీజ్ చేశారు. సునీల్ కశ్యప్ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు శ్రీజో సాహిత్యం సమకూర్చారు. దీనిని దినకర్ కల్వల, అదితి భావరాజు పాడారు. ఇప్పటికే సందీప్ రెడ్డి వంగా చేతుల మీదుగా విడుదల చేసిన ‘సంతాన ప్రాప్తిరస్తు’ మూవీ టీజర్ కు మంచి స్పందన లభించిందని, ఈ పాటకు కూడా శ్రోతలను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉందని శ్రీధర్ రెడ్డి చెబుతున్నారు.